క్లుప్తంగా

ఎమ్మెల్యే పేర్ని నాని క్రిస్మస్ శుభాకాంక్షలు



చిలకలపూడి(మచిలీపట్నం): క్రైస్తవ సోదర, సోదరీమణులకు మాజీ మంత్రి, బందరు శాసన సభ్యుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆదివారం ఒక ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధులు లేని త్యాగం, శాంతియుత సహజీవనం, జీసస్ మానవాళికి ఇచ్చిన మహోన్నతమైన సందేశమన్నారు. క్రైస్తవులు అందరూ క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

వికసిత్ భారత్ గ్రామ సభలు ఆరంభం

టి.కొత్తపాలెం(నాగాయలంక): మండల పరిధిలోని టి.కొత్తపాలెం, నాలి గ్రామాల్లో ఆదివారం వికసిత్ భారత సంకల్ప యాత్ర(వీబీఎస్వై)గ్రామ సభలు ఆదివారం స్థానిక ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ నేతృత్వంలో ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించే దిశగా సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చెప్పారు. ఈ సందర్భంగా క్యాలెండర్లు, బ్రోచర్లు ఆవిష్కరించారు. సంకల్ప యాత్రను వివరించి ప్రమాణం చేయించారు. సర్పంచి బండ్రెడ్డి శివపార్వతి, కేంద్ర సెన్సార్ బోర్డు మాజీ సభ్యురాలు భోగాది రమాదేవి, ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, యాత్ర కోఆర్డినేటర్ తుంగల గిరి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, డాక్టర్ వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం కె.యేసుదాను తదితరులు పాల్గొన్నారు.

చైతన్యంతోనే వినియోగదారులకు మేలు

నాగాయలంక: గ్రామంలోని దివి వినియోగదారుల పరిరక్షణ మండలి ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక ఎండు చేపల సంతలో అవగాహన కార్యక్రమం జరిగింది. సంస్థ అధ్యక్షుడు లకనం నాగాంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహిళా నాయకురాలు తలశిల స్వర్ణలత మాట్లాడుతూ వినియోగదారులు చైతన్యం కావాలని, వ్యాపారులు సక్రమ తూకం, నాణ్యత కలిగిన సరుకు అందించాలని తద్వారా ఉభయులకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం వ్యాపారుల కాటాలను పరిశీలించి సూచనలు చేశారు. కిరాణా వర్తక సంఘం అధ్యక్షుడు చిట్టా వీర అన్నపూర్ణయ్య, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కర్రి కృష్ణమూర్తి, ఎండు చేపల వ్యాపారి పానమాల వెంకటేశ్వరమ్మ, కొక్కిలిగడ్డ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని నేత్రాలు దానం చేసిన కుటుంబ సభ్యులు

నాగాయలంక: గ్రామంలోని 13వ వార్డుకు చెందిన తలశిల వెంకటేశ్వరరావు(65) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మరణించారు. ఆయన నేత్రాలను కుటుంబసభ్యులు విజయవాడ తాడిగడపలోని ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. మృతుని నేత్రాలు దానం చేసి మరో ఇద్దరికి చూపు ఇవ్వాలనే సంకల్పంతో బంధువులు ఆలూరి శ్రీనివాసరావు, తలశిల రాఘవరావు ప్రోత్సాహంతో మృతుని భార్య ఉమాదేవి, కుమారుడు రామకృష్ణ, కుమార్తె అనూష ముందుకొచ్చారు. ఈమేరకు స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకట నారాయణలకు సమాచారం అందించగా వారి సహకారంతో ఆసుపత్రి వైద్య నిపుణుడు డాక్టర్ సాయి బృందం మృతుడి నేత్రాల నుంచి కార్నియాలను సేకరించి తీసుకువెళ్లారు. సుదర్శి ఆధ్వర్యంలో నేత్రదానాల సంఖ్య 194కు చేరుకుందని రఘుశేఖర్ చెప్పారు.

శతాధిక వృద్ధురాలి మృతి



శ్రవణం పుల్లమ్మ(ఫైల్)

గూడూరు: మండలంలోని రాయవరం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు శ్రవణం పుల్లమ్మ(చిట్టెమ్మ)(105) ఆదివారం మృతి చెందారు. పుల్లమ్మ భర్త దాదాపు 30 ఏళ్ల కిందట కాలం చేశారు. ఇప్పటివరకూ పూర్తి ఆరోగ్యంతో తన పనులు తానే చేసుకుంటూ జీవనం సాగించిన పుల్లమ్మ ఆదివారం కన్నుమూశారు. పుల్లమ్మకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పుల్లమ్మ మృతి పట్ల రాయవరం పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల బాలకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు.

క్రిస్మస్ శోభ

లోక రక్షకుడు ఏసుక్రీస్తు జన్మించిన రోజైన క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మచిలీపట్నం నగరంతో పాటు జిల్లాలోని పలు చర్చిలను రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. పలు చర్చిల్లో ఏసుక్రీస్తు జన్మించిన ఇతివృత్తాన్ని వివరిస్తూ ఏర్పాటు చేసిన పశువుల పాకలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచే నగరంలోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

–మచిలీపట్నంటౌన్/పెడన/బంటుమిల్లి/చల్లపల్లి/అవనిగడ్డ



క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన మచిలీపట్నం తెలుగు చర్చి





విద్యుద్దీపాలలో పెడన ఆర్సీఎం చర్చి ; విద్యుద్దీపాల అలంకరణలో బందరు నోబుల్ కాలనీ చర్చి



పోర్టు రోడ్డులోని బాలసదనంలో చిన్నారులతో కలసి కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ సతీమణి సుజాత



దీపకాంతుల్లో బందరు పరాసుపేట ఆర్సీఎం చర్చి



అవనిగడ్డ మండలం కోటగిరి లంకలో ఏర్పాటు చేసిన భారీ స్టార్



విద్యుద్దీపాల వెలుగులో ములపర్రు చర్చి ఆర్సీఎం బాలయేసు మందిరం



పురిటిగడ్డ ఐవీఎం హోంలో క్రీస్తు జననం నాటిక ప్రదర్శిస్తున్న బాలికలు

పేద కుటుంబాల్లో ఐవీఎం విద్యా వెలుగులు

- అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు
- పేద విద్యార్థులకు వస్త్రదానం
- ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

పురిటిగడ్డ(చల్లపల్లి): నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఐవీఎం సేవలు ప్రశంసనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. ఆదివారం చల్లపల్లి మండలం పురిటిగడ్డ ఐవీఎం హోంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ ఆధ్వర్యంలో వంద మంది పేద విద్యార్థులకు నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల జోనల్ ఇన్చార్జి కడవకొల్లు నరసింహారావు, రాజేష్, విశ్రాంత డీఎస్పీ హరి రాజేంద్రబాబు, సీఐ సీహెచ్ నాగ ప్రసాద్, పురిటిగడ్డ మాజీ సర్పంచ్ పరుచూరి వెంకటేశ్వరరావు, సజ్జా బలరాం, ఐవీఎం ప్రతినిధులు వేములపల్లి విజయ, రోజా, సోఫీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన క్రీస్తు జననం నాటిక, భరత నాట్యం, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



పేద విద్యార్థులకు వస్త్రాలు బహూకరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

ఎస్ఐగా ఎంపికైన మురళీకృష్ణకు గ్రామస్తుల సత్కారం

మర్రిపాలెం(నాగాయలంక): సబ్ ఇన్స్పెక్టర్‌గా ఎంపికైన నాగాయలంక మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ యన్నంశెట్టి మురళీకృష్ణను ఆదివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించి అభినందించారు. 2014లో కానిస్టేబుల్‌గా ఎంపికైన మురళీకృష్ణ ప్రస్తుతం ఉమ్మడి కృష్ణాజిల్లా విజయవాడ భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. గ్రామంలోని రైతు కుటుంబానికి చెందిన యన్నంశెట్టి రామారావు, వెంకట పద్మావతిల కుమారుడు మురళీకృష్ణ ప్రభుత్వ పాఠశాలలోనే ప్రాథమిక విద్య పూర్తిచేశారు. పట్టుదలతో చదివి తొలుత టీటీసీ, ఆ తర్వాత దూర విద్య ద్వారా బీఏ పూర్తి చేసి కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరారు. అక్కడితో ఆగకుండా ఎస్.ఐ ఉద్యోగం మీద దృష్టి పెట్టి ఆ లక్ష్యాన్ని సాధించడం తమకు గొప్పగా ఉందని మురళీకృష్ణ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బండ్రెడ్డి రామకృష్ణ, లేబాక నాగేశ్వరరావు, గ్రామస్తులు, బంధువులు పాల్గొన్నారు. తొలుత మురళీకృష్ణ, ఆయన భార్య జాస్మినిలను దుశ్శాలువా,పూలమాలతో సత్కరించారు.



మురళీకృష్ణ దంపతులను సన్మానించిన గ్రామస్తులు

ఎస్ఐగా ఎంపికైన మోపిదేవి యువకుడు

మోపిదేవి: పేదరికం అడ్డుకాదని, కష్టపడి చదివితే దేనినైనా సాధించవచ్చునని గోవాడ నవీన్ నిరూపించారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో మండల కేంద్రం మోపిదేవి దళితవాడకు చెందిన గోవాడ నవీన్ ఎస్ఐగా ఎంపికయ్యాడు. తల్లి దండ్రులు కటిక పేదరికంలో ఉండీ ముగ్గురు మగ పిల్లలను బాగా చదివించారు. పెద్ద కుమారుడు నవీన్ మోపిదేవి ఆదర్శపాఠశాలలో 1 నుంచి 7 తరగతి వరకు చదువుకున్నారు. అనంతరం ఏపీఆర్ఎస్ సింహాచలం గురుకుల పాఠశాలలో 8 నుంచి 10వ తరగతి పూర్తిచేసుకుని, అవనిగడ్డ దివిసీమ పాలిటెక్నిక్ కళాశాలలో చదివాడు. మహారాజా విజయరామ గజపతిరాజు కాలేజి, విజయనగరంలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. అనంతరం దివిసీమ పాలిటెక్నిక్ కళాశాలలో పార్ట్ టైం లెక్చరర్‌గా చేస్తూ అవనిగడ్డ నేతాజీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు శిక్షణ పొందాడు. గత ఏడాది తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐ పరీక్షకు ఎంపికై నాన్ లోకల్ కావడంతో 5 మార్కుల తేడాతో ఎస్ఐ పోస్టు కోల్పోయాడు. అయినా బాధపడకుండా గ్రూప్–1కు ప్రిపేర్ అవుతూ ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పోటీ పరీక్షల్లో ఎస్ఐగా ఎంపికయ్యాడు.



ఎస్ఐగా ఎంపికైన నవీన్

బాల సదనంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

పాల్గొన్న కలెక్టర్ సతీమణి సుజాత

మచిలీపట్నంటౌన్: స్థానిక పోర్టు రోడ్డులోని బాల సదనంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వేడుకలకు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సతీమణి సుజాత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె బాల సదనంలోని చిన్నారులతో కలసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి చిన్నారులకు తినిపించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సువర్ణ, సీడీపీఓ గ్లోరి, బాల సదనం మ్యాట్రిన్ స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కంకటావలో...

గూడూరు: మండల పరిధిలోని కంకటావ ఎంపీపీ పాఠశాలలో సెమీక్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పాస్టర్ హనోక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. సర్పంచ్ మద్దాల వీర వెంకట మోహన రావు, హెచ్ఎం జి.నవీన్‌బాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ స్వరూపరాణి, పాస్టర్ దోమతోటి వీరాస్వామి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగనన్న పాలన

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ చైర్మన్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) అన్నారు. నగరంలోని 36వ డివిజన్‌లో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.16.38 లక్షల వ్యయంతో రెండు సిమెంట్ రోడ్లు, మూడు డ్రెయిన్ పనులకు నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలసి శంకుస్థాపన చేశారు. డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ గూడవల్లి నాగరాజు, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు జవ్వాది రాంబాబు, ఎండీ సద్రుద్దీన్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ కన్వీనర్ యెగ్గోని గాంధీ, కో ఆప్షన్ సభ్యులు మట్టా తులసి, బేతపూడి రవి, మార్కెట్ యార్డు డైరెక్టర్ మొహిసిన్, డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు దార్ల చెన్నకేశవరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ రీజియన్ చైర్మన్ మహేష్‌కు సత్కారం

పెడన: కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్న పిన్నింటి మహేష్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీ రీజియన్ చైర్మన్‌గా(విజయవాడ) నియమించిన విషయం విదితమే. ఈ సందర్భంగా మహేష్‌ను పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సత్కరించి అభినందించారు. పెడన మార్కెట్ యార్డులో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో వీరంతా సీఎంకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మహేష్‌ను సన్మానించారు. మైనార్టీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు గరికపాటి వెంకట రామానాయుడు, సంగా మధుసూదన రావు, కొండవీటి నాగబాబు, కూనసాని గరుడ ప్రసాద్, పట్టపు నాగేశ్వరరావు, కారుమంచి కామేశ్వరరావు, మలిశెట్టి రాజాబాబు పాల్గొన్నారు.



భావదేవరపల్లిలో ఘనంగా హనుమత్ వ్రతం

భావదేవరపల్లి(నాగాయలంక): హనుమత్ వ్రతం పర్వదినం పురస్కరించుకుని గ్రామంలోని శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా ప్రత్యేక వ్రత పూజలు జరిగాయి. ప్రధాన పీఠం వద్ద స్థానిక శ్రీభావన్నారాయణ స్వామి దేవస్థానం వంశ పారంపర్య ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు- లక్ష్మి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త మలిశెట్టి సాంబశివరావు-విజయలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని వెంకటేశ్వరశాస్త్రి బ్రహ్మత్వంలో హనుమత్ వ్రతం, ఆకుపూజ జరిపారు.తొలుత అష్టోత్తర శత హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది.

చిన్నాపురంలో ఉచిత హోమియో వైద్య శిబిరం

కోనేరుసెంటర్: ఎస్ఎస్‌బీ గ్లోబల్ వెల్‌ఫేర్ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని చిన్నాపురం గ్రామంలో ఉచిత హోమియో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో ప్రముఖ హోమియో వైద్యుడు చింతా రవీంద్ర 200 మందికి హోమియో మందులను, సర్వరోగ నివారిణి ఫ్యామిలీ కిట్‌లను, కరోనా నివారణ మాత్రలను ఉచితంగా అందజేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విట్టంశెట్టి వెంకుమాస్టార్, చిన్నాపురం నీటి సంఘం మాజీ అధ్యక్షుడు చలమలశెట్టి వెంకటరమణ డాక్టర్ రవీంద్రను సత్కరించారు.

తుపాను బాధిత రైతులకు రాయితీపై విత్తనాలు

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల రైతు భరోసా కేంద్రంలో ఆదివారం మిచాంగ్ తుపానుకు దెబ్బతిన్న రైతులకు 80 శాతం రాయితీపై పెసర విత్తనాలను ఏవో మురళీకృష్ణ పంపిణీ చేశారు. మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల్లో 150 క్వింటాళ్ల మినుములు, 50 క్వింటాళ్ల పెసలు సిద్ధంగా ఉన్నాయని ఆయన చెప్పారు. తక్కువ కాలంలో పంటకొచ్చే ఈ విత్తనాలను రైతులు తీసుకుని సాగు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, సచివాలయాల మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ వేమూరి రత్నశేఖర్, వీపీఏ రేవతి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పెడన: పెడనలోని భట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 30 సంవత్సరాల కిందట పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1993-94వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన వీరంతా కలుసుకుని ఆనాటి మధురస్మృతులను గుర్తు చేసుకుంటూ ఆనందభరితులయ్యారు. ఒకరినొకరు అప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి గురువులు గోవర్దనరావు, సుభాషిణి, విశ్వం, ప్రభాకర్, మణి, కృష్ణకుమారి, రామకృష్ణ, గంగాధర్‌లను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు ఇమ్రాన్, మెట్ల గోపి, మధు, ఇస్మాయిల్, కారుపర్తి రాము తదితరులు నిర్వహించారు.

సుబ్బారాయుడి ఆలయంలో భక్తుల కోలాహలం



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానం భక్తజనంతో నిండిపోయింది. ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతరప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్ల శాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జనవరి 5న హుండీ కానుకల లెక్కింపు

మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు జనవరి 5వ తేదీ ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో నిర్వహించే ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆసక్తిగల భక్తులు డ్రెస్‌కోడ్‌లో పాల్గొనవచ్చునని వివరించారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ఊరేగింపు

పెడన: పట్టణంలోని శ్రీరుక్మిణి సత్యభామా సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ద్వాదశి సందర్భంగా స్వామివార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత ఉదయం ప్రత్యేక పూజలు, మహా సుదర్శన హోమం, మహా పూర్ణాహుతి, నీరాజనం వంటి కార్యక్రమాలను అర్చకస్వామి అగ్నిహోత్రం హరికృష్ణ పలువురు దంపతులతో నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం స్వామివారితో పాటు అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. సత్యసాయి మందిరం కమిటీ వారు బాలబాలికలతో గ్రామోత్సవంలో పాల్గొని కోలాట నృత్య ప్రదర్శనలు చేశారు. స్వామి వారి ఊరేగింపు వేణుగోపాల స్వామి ఆలయం నుంచి బయల్దేరి బస్టాండు సెంటరులోని అభయాంజనేస్వామి దేవస్థానం వరకు వెళ్లి తిరిగి వేణుగోపాల స్వామి ఆలయానికి చేరుకుంది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఓంకారం, ఈవో టీవీవీ మోహనరావు పర్యవేక్షణలో సిబ్బంది, కమిటీ సభ్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ వారు పాల్గొని ఆయా కార్యక్రమాలను పర్యవేక్షించారు.



పెడన వేణుగోపాల స్వామి గ్రామోత్సవంలో బాలబాలికల కోలాట నృత్యం